అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 338 | వరంగల్ | సోమవారం, 19 అక్టోబర్ 2026 | పేజీలు: 06





బియ్యం కొరత లేదు

- దళారుల దోపిడీతోనే ధరల పెరుగుదల
- కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్న వ్యాపారులు *నియంత్రణలో ప్రభుత్వాల వైఫల్యం

దేశవ్యాప్తంగా బియ్యం ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని వారాలుగా సాధారణ, సన్న బియ్యం ధరలు క్వింటాకు రూ.600 నుంచి రూ.1,000 వరకు పెరిగినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. దీంతో బహిరంగ మార్కెట్లో కిలో బియ్యం ధరపై 20 నుంచి 25 శాతం వరకు అదనపు భారం పడుతోందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బియ్యం ధరలు పెరగడం, రానున్న రోజుల్లో కొరత ఏర్పడుతుందన్న ప్రచారం ప్రజల్లో అయోమయాన్ని పెంచుతోంది.

అక్షరశక్తి ప్రధాన ప్రతినిధి


2

కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహితే నీటిని మళ్లించాలి

నవంబర్ నెలాఖరులోగా పనులు చేపట్టకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన

మేడిగడ్డను సాకుగా చూపి రైతులకు నష్టం చేయొద్దు: తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత





రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రాణహిత నదిలో వృథాగా పోతున్న నీటిని రైతుల సాగు అవసరాలకు వినియోగించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 93 మీటర్లకు పైన కాఫర్ డ్యాం నిర్మించి, ప్రాణహిత నీటిని మళ్లిస్తే సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆమె ప్రతిపాదించారు. నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మాణ పనులు చేపట్టకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులతో కలిసి ఆమె కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలించారు.

3



ఓయూలో కట్టమైసమ్మ ఆలయంపై దాడి

24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేయాలి: ఏబీవీపీ నేత జీవన్



అక్షరశక్తి,కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీలోని మోయిన్ చెరువు సమీపంలో ఉన్న కట్టమైసమ్మ అమ్మవారి ఆలయ గేట్లను ధ్వంసం చేసి, అమ్మవారి విగ్రహం, హారతి సామగ్రి, గంటలు, నైవేద్య పాత్రలను అపహరించినట్లు వస్తున్న సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్ అన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన ఫొటోలను బయటకు రాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో దేవాలయాలకు, విద్యార్థుల విశ్వాసాలకు రక్షణ కల్పించడం అధికారుల బాధ్యతని జీవన్ పేర్కొన్నారు. ఆలయంపై దాడి ఘటనలో నిందితులను 24 గంటల్లో గుర్తించి అరెస్ట్ చేయకపోతే, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వేలాది మంది విద్యార్థులతో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పోలీసులను హెచ్చరించారు.

శాతవాహన యూనివర్సిటీలో 49 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

మంత్రి పొన్నం ప్రభాకర్



అక్షరశక్తి, కరీంనగర్: తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏడు విశ్వవిద్యాలయాల్లో మొత్తం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయనుండగా, శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 49 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చిందని మంత్రి తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో నంబర్లు 141, 142లను విడుదల చేసిందని, కామన్ గైడ్‌లైన్స్ మరియు రోస్టర్ విధానానికి అనుగుణంగా ఈ నెలాఖరు నాటికి నోటిఫికేషన్లు వెలువడనున్నాయని పేర్కొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల్లో ఖాళీల వివరాలు:

- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (హుస్నాబాద్):
- కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (CSE): 07
- CSE - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: 07
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ECE): 07
- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT): 05
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (EEE): 01
- మెకానికల్ ఇంజినీరింగ్: 02
- ఇంగ్లీష్: 01
- మ్యాథమెటిక్స్: 02
- ఫిజిక్స్: 02
- కెమిస్ట్రీ: 02
- ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్: 01
- లైబ్రేరియన్: 01
- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా (యూనివర్సిటీ క్యాంపస్):
- లా (న్యాయశాస్త్రం): 08
- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (ఎల్ఎండీ క్యాంపస్):
- ఫార్మసీ: 02
- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (యూనివర్సిటీ క్యాంపస్):
- కామర్స్: 01

ఈ పోస్టుల భర్తీ ద్వారా ఉన్నత విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందుబాటులోకి వస్తుందని మంత్రి వివరించారు. అర్హత గల నిరుద్యోగ యువత ఈ నియామక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

బియ్యం కొరత లేదు

- **దళారుల దోపిడీతోనే ధరల పెరుగుదల**
- **కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్న వ్యాపారులు**
- **నియంత్రణలో ప్రభుత్వాల వైఫల్యం**



అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి: దేశవ్యాప్తంగా బియ్యం ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని వారాలుగా సాధారణ, సన్న బియ్యం ధరలు క్వింటాకు రూ.600 నుంచి రూ.1,000 వరకు పెరిగినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. దీంతో బహిరంగ మార్కెట్లో కిలో బియ్యం ధరపై 20 నుంచి 25 శాతం వరకు అదనపు భారం పడుతోందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బియ్యం ధరలు పెరగడం, రానున్న రోజుల్లో కొరత ఏర్పడుతుందన్న ప్రచారం ప్రజల్లో అయోమయాన్ని పెంచుతోంది.

నిల్వలు ఉన్నా.. కొరత ప్రచారం!

దేశంలో బియ్యం కొరత ఉందన్న వాదనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ గోదాములు, భారత ఆహార సంస్థ వద్ద ఉన్న నిల్వలు, వరి దిగుబడుల వివరాలను పరిశీలించి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాల్సిన అవసరం ఉంది. గత ఏడాది అధిక వరి దిగుబడులు రావడం, దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలు ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే, ధరల పెరుగుదలకు ఉత్పత్తి కొరతే కారణమని చెప్పలేమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, కేంద్ర పూల్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న బియ్యం నిల్వలపై తాజా అధికారిక గణాంకాలను పరిశీలించడం అవసరం.

నిల్వల నియంత్రణతో ధరలకు రెక్కలు!

కొత్త పంట మార్కెట్లోకి పూర్తిస్థాయిలో రాకముందు ఉండే కాలాన్ని కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బడా మిల్లర్లు, టోకు వ్యాపారులు కుమ్మక్కై బియ్యం నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయకుండా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్, ఎగుమతులపై విధానపరమైన మార్పులపై ఊహాగానాలు కూడా ధరలపై ప్రభావం చూపే అవకాశముంది. అయితే, అక్రమ నిల్వలు, వ్యాపారుల కుమ్మక్కు వంటి ఆరోపణలను సంబంధిత అధికారులు తనిఖీల ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

ధరల నియంత్రణకు చర్యలేవీ?

బియ్యం ధరల పెరుగుదలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పౌరసరఫరాల శాఖలు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. అవసరమైతే బహిరంగ మార్కెట్లో బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రైస్ మిల్లులు, టోకు గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచిస్తున్నారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, సరఫరాలో ఉద్దేశపూర్వక అంతరాయాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సామాన్యుడికి అందుబాటులో అన్నం

బియ్యం ధరల పెరుగుదల నేరుగా పేద, మధ్యతరగతి కుటుంబాల ఆహార బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది. నిల్వల లభ్యత, మార్కెట్ సరఫరా, వ్యాపారుల నిల్వలపై పారదర్శక సమాచారం అందుబాటులో ఉంచడంతో పాటు, ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. బియ్యం కొరతపై వస్తున్న ప్రచారాన్ని పక్కనపెట్టి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించాలి. బియ్యం నిల్వలు సమృద్ధిగా ఉన్నాయా, సరఫరాలో ఎక్కడైనా అడ్డంకులు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నప్పుడే సామాన్యుడి కంచంలో అన్నం కనిపిస్తుంది.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

- **18 సర్కిళ్ల ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్**
- **సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో నిరంతరం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు**
- **సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



అక్షరశక్తి, హనుమకొండ: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ అంతరాయాలు కలగకుండా అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హన్మకొండ , నక్కలగుట్ట ప్రధాన కార్యాలయం నుంచి 18 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పండుగ సమయంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు. ప్రజలకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ వరకు దసరా సెలవులు కొనసాగనున్న నేపథ్యంలో నగరాల నుంచి ప్రజలు తమ స్వగ్రామాలకు, పట్టణాలకు పెద్ద సంఖ్యలో తిరిగి వస్తున్నందున విద్యుత్ సరఫరా విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండుగ సమయంలో అత్యవసరమైతే తప్ప లైన్ క్లియరెన్స్‌లు (ఎల్‌సీలు), మరమ్మతులు, ఇతర పనుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేయరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, అనవసర అంతరాయాలు లేకుండా చూడాలన్నారు.

ప్రతి సర్కిల్, డివిజన్ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను నిర్వహించాలని సీఎండీ ఆదేశించారు. విద్యుత్ సరఫరా పరిస్థితిని ఫీడర్, డీటీఆర్ వారీగా నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. రాబోయే మూడు రోజుల పాటు అధికారులు, సిబ్బంది సమన్వయంతో 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సీఎండీ పేర్కొన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా అవసరమైన సిబ్బంది, వాహనాలు, మరమ్మతు సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దసరా పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకునేలా, విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి .మోహన్ రావు, టి .మధుసూదన్ , చీఫ్ ఇంజినీర్లు అశోక్ , సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి

- **నవంబర్ నెలాఖరులోగా పనులు చేపట్టకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన**
- **మేడిగడ్డను సాకుగా చూపి రైతులకు నష్టం చేయొద్దు: తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**















అక్షరశక్తి, కన్నెపల్లి: రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రాణహిత నదిలో వృథాగా పోతున్న నీటిని రైతుల సాగు అవసరాలకు వినియోగించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 93 మీటర్లకు పైన కాఫర్ డ్యాం నిర్మించి, ప్రాణహిత నీటిని మళ్లిస్తే సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆమె ప్రతిపాదించారు. నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మాణ పనులు చేపట్టకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులతో కలిసి ఆమె కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణలో గోదావరి, కృష్ణా నదుల జలాలను సమర్థంగా వినియోగించుకుంటే కరువు పరిస్థితులను చాలావరకు నివారించవచ్చన్నారు. తెలంగాణ ఉద్యమం సాగిందే రాష్ట్ర నీటి వనరులపై హక్కు సాధించుకోవడానికని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వర్షాలు అనుకూలంగా కురవడంతో నీటి సమస్య తీవ్రత అంతగా కనిపించలేదని, అయితే ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉత్తర తెలంగాణలోని ఎస్సారెస్పీ, కడెం, అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టుల ద్వారా సుమారు 37 లక్షల ఎకరాలకు సాగునీటి స్థిరీకరణకు ప్రయత్నాలు జరిగాయని కవిత పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీగా ఖర్చు చేసినప్పటికీ కొత్తగా సాగునీరు అందిన విస్తీర్ణం పరిమితంగానే ఉందన్నారు. ప్రాజెక్టు ద్వారా మరో 19 లక్షల ఎకరాలకు నీరు అందించాలంటే కాలువల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని, ఇందుకు మరో రూ.50 వేల కోట్లు అవసరమవుతాయని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.26 వేల కోట్లు ఖర్చు చేసినా కొత్తగా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదని కవిత విమర్శించారు. ప్రభుత్వం ఖర్చుల వివరాలపై కాకుండా రైతులకు వాస్తవంగా అందుతున్న ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

కాఫర్ డ్యాంతో ప్రత్యామ్నాయ పరిష్కారం

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యాం నిర్మిస్తే మేడిగడ్డ బ్యారేజీపై ఆధారపడకుండా అన్నారం, సుందిళ్లకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుందని కవిత తెలిపారు. తద్వారా ప్రాజెక్టుల నెట్‌వర్క్‌ను రీచార్జ్ చేసుకోవచ్చని వివరించారు. ఈ ప్రతిపాదనను అమలు చేసేందుకు సుమారు రూ.25 కోట్లు ఖర్చవుతాయని, నెలన్నర రోజుల్లో పనులు పూర్తి చేయవచ్చని అంచనా వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక వివరాలను ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రాణహితలో రోజుకు సుమారు రెండు టీఎంసీల నీరు ప్రవహిస్తున్నప్పటికీ, కరువు పరిస్థితుల్లో ఆ నీటిని సద్వినియోగం చేసుకోకపోవడం బాధాకరమన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వచ్చే ఏడాది వర్షాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని ఇప్పుడే వినియోగించుకోవాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులకు కూడా ఇదే అనువైన సమయమని, ఆ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రైతులకు నీరు, విద్యుత్ అందించాలి

రాష్ట్రంలో సుమారు కోటి 36 లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా, ఈ సీజన్‌లో కోటి 10 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని కవిత పేర్కొన్నారు. పంటలు చివరి దశలో ఉన్న సమయంలో రైతులకు సాగునీరు, విద్యుత్ అత్యవసరమని తెలిపారు. రైతులకు విద్యుత్ అందించాలని తాము ఇప్పటికే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామని, తమ ఒత్తిడి తర్వాతే ముఖ్యమంత్రి కేంద్రం నుంచి విద్యుత్ కోరే విషయంపై స్పందించారని అన్నారు. ఎల్లంపల్లి సహా పలు రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గిపోయాయని, ఎల్లంపల్లిలోని నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచినట్లు తెలిపారు. రానున్న పది నెలలు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 21 వేల చెరువులు ఎండిపోవడంతో ముదిరాజ్, బెస్త వర్గాలకు చెందిన మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన

రాజకీయ పార్టీలు సమస్యలను ప్రశ్నించడమే కాకుండా వాటి పరిష్కార మార్గాలను కూడా సూచించాలని కవిత అన్నారు. తాము చేస్తున్న ప్రతిపాదనల్లో సాంకేతికంగా ఏవైనా మార్పులు అవసరమైతే ఇంజనీర్ల సూచనల మేరకు సవరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు తావివ్వకూడదని, రైతు సంఘాల వ్యవహారాల్లోనూ రాజకీయ జోక్యం తగదని హితవు పలికారు. సాగునీరు, విద్యుత్ అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించకపోతే తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రతిపాదనలను అమలు చేస్తామని కవిత స్పష్టం చేశారు.

వైద్య సేవలు, నిర్వహణ మెరుగ్గా ఉండాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి







అక్షరశక్తి, హనుమకొండ: వెల్ నెస్ సెంటర్ లో వైద్య సేవలు, నిర్వహణ మెరుగ్గా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న వెల్ నెస్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని డెంటల్, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్టీ, ఫార్మసీ స్టోర్, ఫార్మసీ, ల్యాబ్, తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించి అక్కడ పేషంట్లకు అందుతున్న వైద్య సేవలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మితను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాలలో ఓపి చూస్తున్న వైద్యులతో కలెక్టర్ మాట్లాడారు. ఓపి సేవల నిమిత్తం వస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని డాక్టర్ సుస్మిత జిల్లా కలెక్టర్ కు వివరించారు. వైద్యులు సిబ్బంది హాజరు పట్టికను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రాంగణంలో ఉన్న టాయిలెట్స్ ను పరిశీలించారు. ఓపి సేవల కోసం వచ్చిన పేషంట్ల వివరాలు నమోదు చేస్తున్న విధానం, ఫార్మసీలో పేషెంట్లకు మందులను ఏ విధంగా అందిస్తున్నారనేది జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవల నిమిత్తం అక్కడ ఉన్న పేషంట్లతో కలెక్టర్ మాట్లాడారు. మందులు తీసుకునేటప్పుడు జాప్యం జరుగుతుందని, ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ కు పేషంట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషెంట్లకు రాసిన మందుల వివరాలను త్వరగా ఆన్లైన్ లో నమోదు చేసి ఇవ్వాలన్నారు. డేటా ఎంట్రీ చేయడం మరింత వేగవంతం కావాలన్నారు. జాప్యం లేకుండా డేటా ఎంట్రీ కోసం అదనంగా కంప్యూటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింక్ కెనాల్ నిలిపివేతపై ఎన్‌సీఎస్‌టీ విచారణ

అక్షరశక్తి, హైదరాబాద్: జీవో నంబర్ 98ను రద్దు చేయాలని, ప్రతిపాదిత మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టును నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది విశ్వ జంపాల సమర్పించిన ఫిర్యాదుపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ) విచారణకు ఆదేశించింది. ఈ నెల 26న మధ్యాహ్నం 2.20 గంటలకు హైదరాబాద్‌లోని దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ విచారణ చేపట్టనున్నారు. సంబంధిత రికార్డులు, ఆధారాలతో హాజరుకావాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. అధికారులు హాజరుకాకపోతే రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది. విచారణలో విశ్వ జంపాల బాధితుల తరఫున వాదనలు వినిపించనున్నారు.

బతుకమ్మ పండుగ: పూల సౌందర్యమే కాదు..

పాలకులను ప్రశ్నించే తెలంగాణ

ప్రజల తిరుగుబాటు స్వరం!

ప్రకృతిని ప్రేమించే నేల.. అన్యాయాన్ని ఎదిరించే గడ్డ.. ఆత్మగౌరవాన్ని చాటే ప్రజా సంస్కృతి!

తెలంగాణ అంటేనే ఒక ప్రశ్న.. ఒక పోరాటం.. ఒక దిక్కర స్వరం! బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ప్రజల బతుకు పాట, మహిళల ఆత్మగౌరవం, గ్రామీణ సంస్కృతి, అన్యాయాన్ని ప్రశ్నించే ప్రజల చైతన్యానికి ప్రతీక. తెలంగాణ అంటే పల్లె జీవితం, మట్టి వాసన, పచ్చని పొలాలు, చెరువులు, జానపద గీతాలు, ఆప్యాయతలు, ఆత్మీయతలు గుర్తుకొస్తాయి. ఈ సంస్కృతీ సంప్రదాయాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే అద్భుతమైన పండుగ బతుకమ్మ. పూలను పేర్చి, ప్రకృతిని ఆరాధించి, సమూహంగా పాటలు పాడుతూ, ఆటలాడుతూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి అద్దం పడుతుంది.

బతుకమ్మ పండుగలో పూల సౌందర్యం ఎంత ముఖ్యమో, ఆ పూల చుట్టూ చేరే మనుషుల మధ్య ఆప్యాయతలు, అనుబంధాలు, సామాజిక ఐక్యత కూడా అంతే ముఖ్యమైనవి. అందుకే బతుకమ్మను కేవలం ఒక పండుగగా చూడలేం. అది తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వం, గ్రామీణ జీవన సౌందర్యం, మహిళల గౌరవం, సామాజిక సమానత్వ ఆకాంక్షలకు ప్రతీక. ప్రకృతితో ముడిపడిన పండుగ బతుకమ్మ ప్రత్యేకత ఏమిటంటే, ప్రకృతిలో సహజంగా లభించే పూలతోనే ఈ పండుగను జరుపుకోవడం. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర కాలానుగుణ పూలతో బతుకమ్మను అందంగా అలంకరిస్తారు. వర్షా కాలం ముగిసి, ప్రకృతి కొత్త అందాలను సంతరించుకునే సమయంలో వచ్చే ఈ పండుగ మనిషికి ప్రకృతికి మధ్య ఉన్న విడదీయలేని బంధాన్ని గుర్తుచేస్తుంది.

పూలతో బతుకమ్మను పేర్చడం అనేది కేవలం అలంకరణ కాదు. ప్రకృతిని ప్రేమించడం, స్థానిక జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం, చెరువులు, కుంటలు, నీటి వనరుల ప్రాముఖ్యతను గుర్తించడం వంటి విలువలను కూడా ఈ పండుగ మనకు గుర్తుచేస్తుంది. పల్లె ప్రజల జీవితాల్లో ప్రకృతి కేవలం జీవనాధారం మాత్రమే కాదు; అది వారి నమ్మకం, ఆచారం, సంస్కృతి, భావోద్వేగాలకు మూలం.

గ్రామీణ సంస్కృతికి జీవం పోసే బతుకమ్మ

తెలంగాణ పల్లెల్లో బతుకమ్మ పండుగ సందడి ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఇంటింటా పూల సేకరణ, మహిళలు కలిసి బతుకమ్మలను పేర్చడం, సాయంత్రం వేళ గ్రామ కూడళ్లలో లేదా చెరువుల సమీపంలో సమూహంగా చేరి పాటలు పాడడం గ్రామీణ జీవితానికి ప్రత్యేకమైన అందాన్ని ఇస్తాయి.

బతుకమ్మ పాటల్లో గ్రామీణ ప్రజల జీవన అనుభవాలు, కుటుంబ సంబంధాలు, సామాజిక పరిస్థితులు, స్థానిక చరిత్ర, స్త్రీల భావోద్వేగాలు ప్రతిబింబిస్తాయి. ఇవి కేవలం వినోద గీతాలు కావు; తరతరాలుగా మౌఖికంగా సంక్రమిస్తున్న ప్రజా సాహిత్య సంపద. పుస్తకాల్లో లిఖితం కాని ఎన్నో సామాజిక అనుభవాలు ఈ జానపద గీతాల్లో జీవిస్తూ ఉంటాయి. పల్లెల్లో ఒకరి ఇంటి సంతోషం అందరి సంతోషంగా, ఒకరి బాధ అందరి బాధగా భావించే సామూహిక జీవన విధానం కనిపిస్తుంది. బతుకమ్మ ఆ ఐక్యతను మరింత బలపరుస్తుంది. ఆర్థిక స్థితిగతులు, కుటుంబ నేపథ్యాలు, సామాజిక అంతరాలు ఏవైనా సరే, పూల పండుగ సందర్భంగా ప్రజలు ఒకచోట చేరి తమ సంస్కృతిని పంచుకోవడం ఈ పండుగ గొప్పతనం.

మహిళల గౌరవానికి, ఐక్యతకు ప్రతీక

బతుకమ్మ పండుగలో మహిళల పాత్ర అత్యంత ప్రధానమైనది. పండుగకు సంబంధించిన సంప్రదాయాలను కాపాడుతూ, పాటలను తరతరాలకు అందిస్తూ, కుటుంబాలను, సమాజాలను కలుపుతూ మహిళలు కీలకమైన సాంస్కృతిక బాధ్యతను



నిర్వర్తిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, వ్యవసాయ పనులు, ఇంటి పనుల మధ్య తమ భావాలను వ్యక్తం చేసుకునే అవకాశాలు పరిమితంగా ఉన్న అనేకమంది మహిళలకు బతుకమ్మ ఒక ఆత్మీయ వేదికగా నిలిచింది. పాటల ద్వారా తమ అనుభవాలను, ఆశలను, ఆవేదనలను, ఆనందాలను వ్యక్తం చేసుకునే అవకాశం కల్పించింది.

అందుకే బతుకమ్మను మహిళల ఆత్మీయతకు, సాంస్కృతిక నాయకత్వానికి ప్రతీకగా చూడాలి. మహిళలకు గౌరవం ఇవ్వడం అంటే కేవలం పండుగ రోజున వారిని సత్కరించడం కాదు. వారి హక్కులను గౌరవించడం, విద్యకు అవకాశాలు కల్పించడం, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడడం, సమాజంలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించడం కూడా అంతే అవసరం.

బతుకమ్మ మనకు అందించే సాంస్కృతిక స్ఫూర్తి ఈ విలువలను ఆచరణలో పెట్టడానికి ప్రేరణ కావాలి.

పల్లె ప్రజల గౌరవం.. తెలంగాణ ఆత్మగౌరవం

తెలంగాణ సంస్కృతి గురించి మాట్లాడేటప్పుడు గ్రామీణ ప్రజల కృషిని విస్మరించలేం. రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, గ్రామీణ మహిళలు, జానపద కళాకారులు తమ దైనందిన జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూనే మన సంప్రదాయాలను సజీవంగా ఉంచుతున్నారు. వారి జీవన విధానంలోనే తెలంగాణ సంస్కృతికి అసలైన పునాది ఉంది.

బతుకమ్మ పండుగ ఆ పునాదిని మనకు గుర్తుచేస్తుంది. సంస్కృతి అనేది కేవలం వేదికలపై నిర్వహించే ఉత్సవాలు, అలంకరణలు, అధికారిక కార్యక్రమాలతోనే పరిమితం కాదు. ఒక గ్రామంలోని ప్రజలు పరస్పరం గౌరవించుకోవడం, మహిళలకు సముచిత స్థానం కల్పించడం, ప్రకృతిని సంరక్షించడం, జానపద సంపదను భావితరాలకు అందించడం కూడా సంస్కృతిలో భాగమే.

తెలంగాణ ఆత్మగౌరవం అంటే మన భాషను, మన యాసను, మన పాటలను, మన పండుగలను గర్వంగా నిలబెట్టుకోవడం. మన పల్లెలను, మన గ్రామీణ ప్రజలను గౌరవించడం. మన సంప్రదాయాలను ఆధునిక సమాజంలోనూ సజీవంగా కొనసాగించడం. ఈ లక్షణాలన్నీ బతుకమ్మ పండుగలో అంతర్లీనంగా కనిపిస్తాయి.

పాటల్లో పలికిన ప్రశ్న.. పల్లెల్లో పుట్టిన తిరుగుబాటు!

తెలంగాణ అంటేనే ఒక ప్రశ్న.. ఒక పోరాటం.. ఒక దిక్కర స్వరం! ఈ నేల చరిత్రను పరిశీలిస్తే అన్యాయాన్ని సహించని ప్రజల పోరాటాలు, తమ హక్కుల కోసం నిలబడిన రైతులు, కూలీలు, మహిళలు, సామాన్య ప్రజల త్యాగాలు కనిపిస్తాయి. ఆ పోరాట స్ఫూర్తి రాజకీయ సభల్లోనే కాదు, ప్రజల జానపద గీతాల్లోనూ ప్రతిధ్వనించింది.

చరిత్రలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో దొరల పెత్తనం, వెట్టిచాకిరీ, భూస్వామ్య దోపిడీ, కూలీల కష్టాలు వంటి అనేక సమస్యలు ప్రజలను వేధించాయి. ఆ కాలపు బాధలు, ప్రతిఘటనలు జానపద గీతాల్లోనూ చోటుచేసుకున్నాయి. కొన్ని బతుకమ్మ పాటల్లో స్థానిక చరిత్ర, పీడితుల ఆవేదన, అన్యాయాన్ని ఎదిరించిన వీరుల జ్ఞాపకాలు కనిపిస్తాయి.

ప్రజల పాటలో ఒక ప్రత్యేకత ఉంటుంది. పాలకుడి ముందు నిలబడి ప్రశ్నించలేని వ్యక్తి, పాటలో తన బాధను చెప్పగలడు. సభలో మాట్లాడలేని మహిళ, పాటలో తన ఆవేదనను వినిపించగలదు. అందుకే జానపద గీతం అనేది కేవలం సంగీతం కాదు; అది ప్రజల సామాజిక చరిత్రకు ఒక సజీవ రూపం.

పాలకులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను మరిచినప్పుడు, పేదల కష్టాలను పట్టించుకోనప్పుడు, రైతుల

సమస్యలను విస్మరించినప్పుడు ప్రజలు ప్రశ్నించాలి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు; అది ప్రజల హక్కు. తెలంగాణ పల్లె సంస్కృతి మనకు నేర్పే ముఖ్యమైన పాఠాల్లో ఇదొకటి.

ప్రజల ప్రశ్నించే స్వరానికి ప్రతీకగా పాటలు
బతుకమ్మ పాటల్లో పూల సౌందర్యంతో పాటు ప్రజల జీవితం, సామాజిక బాధ్యత, పాలకుల పట్ల ప్రజల ఆకాంక్షలు, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా తెలంగాణ పాట యాసలో ప్రతిబింబిస్తారు.

పాలకుడా.. ప్రజల మాట వినవయ్యా!

పూల బతుకమ్మ ఉయ్యాలో..
పల్లె బతుకులు చూడు ఉయ్యాలో..
ఓట్లు అడిగే వేళ ఉయ్యాలో..
గడప గడప తిరిగే ఉయ్యాలో..
గెలిచినంక మరచితివా ఉయ్యాలో..
గరీబోళ్ల గోసలన్నీ ఉయ్యాలో..
పదవి నీదని పొంగకయ్యా..
ప్రజలే నీకు బలమయ్యా!

ఈ పాట ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చే పాలకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను మరిచిపోకూడదని ప్రశ్నిస్తుంది. అధికారం ప్రజల నుంచి వస్తుంది. కాబట్టి పాలనలో ప్రజలకు జవాబుదారీతనం ఉండాలనే ప్రజాస్వామ్య విలువను తెలియజేస్తుంది.

రైతన్న కన్నీటికి జవాబు ఎవ్వరు?

తంగేడు పూలు ఉయ్యాలో..
తల్లి నేల గుండె ఉయ్యాలో..
చెమట చిందించే రైతన్నకు
ఉయ్యాలో..
చెల్లని గిట్టుబాటు ఎందయ్యా?
పంట పండించే చేతులకే ఉయ్యాలో..
పస్తుల బాధలు ఎందయ్యా?
రైతు బతుకు నిలవనిదే ఉయ్యాలో..
రాష్ట్ర అభివృద్ధి ఎక్కడయ్యా?

ఈ పాట వ్యవసాయం మీద ఆధారపడి జీవించే రైతుల సమస్యలను పాలకులు నిర్లక్ష్యం చేయకూడదని గుర్తుచేస్తుంది. పంటకు గిట్టుబాటు ధర, సాగునీరు, రుణభారం నుంచి ఉపశమనం, వ్యవసాయ కూలీలకు గౌరవప్రదమైన జీవితం వంటి అంశాలు ప్రభుత్వ విధానాల్లో ప్రాధాన్యత పొందాలని సూచిస్తుంది.

హామీల పూలు కాదు.. చేతల్లో న్యాయం కావాలి!

బంతిపూల బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు మాటలు చాలయ్యా..
మా ఊరి బాటలు బాగుపడాలె
ఉయ్యాలో..
మా చెరువు నీళ్లు నిలవాలె..
మా బిడ్డలకు చదువు రావాలె
ఉయ్యాలో..
మా ఇంట్లో దీపం వెలగాలె..
మాటలతోనే మభ్యపెట్టకయ్యా..
చేతల్లో న్యాయం చూపవయ్యా!

ఈ పాట గ్రామీణ అభివృద్ధి అనేది ప్రకటనలతోనో, ప్రచారంతోనో కొలవలేమని చెబుతుంది. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పుడే ప్రజలకు నిజమైన అభివృద్ధి ఫలాలు అందుతాయి.

తెలంగాణ బిడ్డలమయ్యా.. తలవంచం అన్యాయానికి!

గునుగు పూల బతుకమ్మ ఉయ్యాలో..
గుండెల నిండా ధైర్యం ఉయ్యాలో..
అన్యాయం ఎదురైతే
అడుగుతామయ్యా..
అధికారం తప్ప చేస్తే
నిలదీస్తామయ్యా..
మా యాస మా పాట ఉయ్యాలో..
మా పల్లె మా గౌరవం ఉయ్యాలో..
భయపెట్టి గొంతు నొక్కలేరు..
ప్రజల గొంతును ఆపలేరు!

ఈ పాట తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ప్రశ్నించే తత్వం, ప్రజాస్వామ్య హక్కుల పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. పాలకులు ఎవరైనా సరే, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాంతియుతంగా, ధైర్యంగా ప్రశ్నించాలనే సందేశాన్ని అందిస్తుంది.

సామాజిక సమానత్వానికి సందేశం

పండుగల అసలైన ప్రయోజనం ప్రజలను కలపడం, పరస్పర గౌరవాన్ని పెంపొందించడం, సమాజంలో సానుకూల భావాలను బలపరచడం. బతుకమ్మ కూడా అదే సందేశాన్ని అందిస్తుంది. పూలన్నీ ఒకే రంగులో ఉండవు; ఒక్కో పువ్వుకు ఒక్కో రంగు, ఒక్కో రూపం, ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అయినప్పటికీ అవన్నీ కలిసినప్పుడే బతుకమ్మకు సంపూర్ణమైన అందం వస్తుంది. మన సమాజం కూడా అంతే. భిన్నమైన ఆలోచనలు, వృత్తులు, సామాజిక నేపథ్యాలు కలిగిన ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసి జీవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. కుల, మత, ఆర్థిక భేదాలకు అతీతంగా మానవత్వానికి ప్రాధాన్యత ఇవ్వడం, అణగారిన వర్గాల గౌరవాన్ని కాపాడడం, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం మన సామాజిక బాధ్యత. బతుకమ్మలోని పూల ఐక్యతను మనుషుల ఐక్యతకు ప్రతీకగా భావిస్తే, ఈ పండుగ మనకు అందించే సందేశం మరింత విస్తృతమవుతుంది.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిలో బతుకమ్మ స్థానం
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమ కాలంలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రాధాన్యత లభించింది. తెలంగాణ భాష, యాస, జానపద కళలు, స్థానిక సంప్రదాయాల పట్ల ప్రజల్లో ఉన్న అభిమానాన్ని బతుకమ్మ వంటి పండుగలు మరింత బలంగా వ్యక్తం చేశాయి.

మన సంస్కృతిని మనమే గౌరవించుకోవాలనే భావన, మన అస్తిత్వాన్ని మనమే నిలబెట్టుకోవాలనే ఆకాంక్ష తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిలో ముఖ్యమైన అంశాలు. ఈ నేపథ్యంలో బతుకమ్మ పండుగ కేవలం ఆచారానికి పరిమితం కాకుండా, తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును ప్రతిబింబించే ప్రజా పండుగగా విస్తృత గుర్తింపు పొందింది.

తెలంగాణ చరిత్రలో జానపద పాటలు ప్రజల బాధలను మాత్రమే కాకుండా వారి ఐక్యతను, పోరాట స్ఫూర్తిని కూడా వ్యక్తం చేశాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ పాట ప్రజలను చైతన్యపరిచిన శక్తివంతమైన సాధనంగా నిలిచింది. అయితే బతుకమ్మలోని తిరుగుబాటు భావనను ఒక రాజకీయ పార్టీకి లేదా ఒక ప్రభుత్వానికి మాత్రమే పరిమితం చేయకూడదు. ప్రజల సమస్యలను పట్టించుకోని ఏ పాలననైనా ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంటుంది. ప్రజాస్వామ్యంలో పాలకులు మారవచ్చు; కానీ ప్రజల హక్కులు, గౌరవం, సంక్షేమం పట్ల ఉండాల్సిన బాధ్యత మారదు.

బతుకమ్మలో తిరుగుబాటు అంటే ప్రజల గౌరవం కోసం నిలబడటం!

బతుకమ్మ చుట్టూ మహిళలు వలయంగా నిలబడి ఒకే లయలో పాట పాడటం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది. ఒక్కొక్కరి గొంతు చిన్నదిగా అనిపించినా, అందరి గొంతులు కలిసినప్పుడు అది బలమైన సామూహిక స్వరంగా మారుతుంది. అదే ఐక్యత ప్రజాస్వామ్యానికి పునాది. పాలకులను గౌరవించడం ప్రజాస్వామ్య మర్యాద. వారు తప్పు చేసినప్పుడు ప్రశ్నించడం ప్రజాస్వామ్య బాధ్యత. ప్రజల సమస్యలను వినిపించడం, అన్యాయాన్ని ఎదిరించడం, హక్కుల కోసం నిలబడడం తెలంగాణ చైతన్యానికి ప్రతీకలు.

తెలంగాణ ప్రజల తిరుగుబాటు స్వరం అంటే కేవలం నినాదాలు చేయడం కాదు. గ్రామానికి రహదారి ఎందుకు లేదని అడగడం, రైతుకు గిట్టుబాటు ధర ఎందుకు అందడం లేదని ప్రశ్నించడం, పేదలకు ప్రభుత్వ పథకాలు ఎందుకు చేరడం లేదని నిలదీయడం, మహిళలకు సమాన గౌరవం ఎందుకు లభించడం లేదని అడగడం కూడా తిరుగుబాటే. ప్రజల హక్కుల కోసం శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించడం నిజమైన పౌర చైతన్యం.

భావితరాలకు అందించాల్సిన వారసత్వం
నేటి ఆధునిక జీవన విధానంలో పాత సంప్రదాయాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. పట్టణీకరణ, జీవనశైలిలో మార్పులు, స్థానిక ప్రకృతి వనరుల క్షీణత వంటి పరిస్థితుల్లో బతుకమ్మ పండుగ వెనుక ఉన్న అసలు విలువలను భావితరాలకు తెలియజేయడం అత్యంత అవసరం. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సంఘాలు, సాంస్కృతిక సంస్థలు బతుకమ్మ పాటల సేకరణ, జానపద కళాకారుల ప్రోత్సాహం, స్థానిక పూల మొక్కల పెంపకం, చెరువుల సంరక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టాలి. పిల్లలకు బతుకమ్మను కేవలం ఒక వేడుకగా కాకుండా, ప్రకృతి ప్రేమకు, మహిళా గౌరవానికి, గ్రామీణ సంస్కృతికి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా పరిచయం చేయాలి. అలాగే పండుగల నిర్వహణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, నీటి వనరులను కలుషితం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం, స్థానిక సంప్రదాయాలను గౌరవించడం ద్వారా పర్యావరణ హితమైన వేడుకలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

పూల పండుగలో ప్రజల స్వరం వినిపించాలి!

బతుకమ్మ పండుగ మనకు పూల అందాన్ని మాత్రమే చూపించదు; మనిషి జీవితంలోని అనుబంధాల విలువను కూడా తెలియజేస్తుంది. ప్రకృతిని ప్రేమించమని, మహిళలను గౌరవించమని, గ్రామీణ ప్రజల సంస్కృతిని కాపాడమని, భిన్నత్వంలో ఐక్యతను పెంపొందించమని సందేశమిస్తుంది. పూలను పేర్చి బతుకమ్మను అందంగా తీర్చిదిద్దినట్లే, మానవత్వం, సమానత్వం, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యత అనే విలువలతో మన సమాజాన్ని కూడా అందంగా తీర్చిదిద్దుకోవాలి. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం ఎంత ముఖ్యమో, దాని వెనుక ఉన్న సంస్కృతిని, ప్రకృతి ప్రేమను, మహిళా గౌరవాన్ని, గ్రామీణ ప్రజల ఆత్మగౌరవాన్ని మన జీవితాల్లో ఆచరించడం అంతకంటే ముఖ్యం. బతుకమ్మ పాటల్లో పూల సౌందర్యం ఉండాలి. పల్లె ప్రజల జీవితం ఉండాలి. మహిళల గౌరవం ఉండాలి. అవసరమైన చోట పాలకులను నిలదీసే ప్రశ్న కూడా ఉండాలి. ఎందుకంటే సంస్కృతి అంటే కేవలం గతాన్ని పూజించడం కాదు; వర్తమానాన్ని ప్రశ్నిస్తూ భవిష్యత్తును మెరుగుపరచడం కూడా. బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ బతుకు పాట!

బతుకమ్మ అంటే సంప్రదాయం మాత్రమే కాదు.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం!
తెలంగాణ అంటే నేల మీద ప్రేమ మాత్రమే కాదు..

అన్యాయంపై ప్రశ్నించే ధైర్యం కూడా!

మా హక్కుల కోసం ఉయ్యాలో..
మా భవిష్యత్తు కోసం ఉయ్యాలో..
నిరుద్యోగుల ఆశల కోసం
ఉయ్యాలో..
పేదల చదువు వైద్యం కోసం
ఉయ్యాలో..
ఊరంతా జనం ఒక్కటవుదాం
ఉయ్యాలో..
ఒకే గొంతుతో నిలబడుదాం
ఉయ్యాలో..
కులమతాలకు అతీతంగా ఉయ్యాలో..
ప్రజల పక్షాన పోరాడుదాం
ఉయ్యాలో..
బతుకమ్మ సాక్షిగా మాటిద్దాం
ఉయ్యాలో..
ప్రజా సంపదను కాపాడుదాం
ఉయ్యాలో..
పాలకుల తప్పును ప్రశ్నిద్దాం
ఉయ్యాలో..
ప్రజాస్వామ్యాన్ని నిలబెడదాం
ఉయ్యాలో..
ప్రజలే బలం.. ప్రజలే పాలకులు
ఉయ్యాలో..

ప్రజల ప్రశ్నే ప్రజాస్వామ్య ఆయుధం
ఉయ్యాలో..
అన్యాయంపై అందరం ఒక్కటవుదాం
ఉయ్యాలో..
న్యాయం జరిగే వరకు నిలబడుదాం
ఉయ్యాలో!

మన సంకల్పం ఒక్కటే ప్రజా సంపదకు జవాబుదారీతనం ఉండాలి, పాలకులు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి, అన్యాయాలు–అక్రమాలను ప్రజలమంతా ఐక్యంగా, శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎదిరించాలి!

పూలు పూయాలి.. పల్లెలు బాగుపడాలి.. మహిళల గౌరవం పెరగాలి.. ప్రజల గొంతు స్వేచ్ఛగా వినిపించాలి!
బతుకమ్మ బతకాలి.. పల్లె సంస్కృతి వర్ధిల్లాలి.. తెలంగాణ సాంస్కృతిక వైభవం తరతరాలకు నిలవాలి!



రచన: రేపల్లె నరోత్తమ సూరి
ప్రెసిడెంట్, BE HUMAN FORUM, తెలంగాణ రాష్ట్రం

GUEST COLUMN

చేజారిన వసంతం – మనసును తడిమే అనుబంధాల విషాదగాథ



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

రచయిత చిరు పరిచయం:

దంత వైద్యుడు.. సాహిత్య ప్రియుడు వృత్తి రీత్యా దంత వైద్యుడు అయినప్పటికీ, సాహిత్యం పట్ల మక్కువతో మూడు దశాబ్దాలకు పైగా కథలు రాస్తూ పాఠకులను అలరిస్తున్న వ్యక్తి కె.ఎల్.వి. ప్రసాద్. వరంగల్ కు చెందిన ఈయన ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూనే, తన కలానికి పదును పెట్టి ఎన్నో మంచి కథలను అందించారు.

ఆరంభంలో తనకున్న రచనా సామర్థ్యంపై సందేహం ఉన్నప్పటికీ, తన కథలకు పాఠకుల నుండి మంచి ఆదరణ లభించడంతో ఆయన నిరంతరం రాస్తూ ముందుకు సాగారు. 1982లో 'స్వాతి' వారపత్రికలో ఆయన తొలి కథ ప్రచురిత మైంది. అప్పటి నుండి వెనుదిరిగి చూడకుండా, తెలుగులో పదునైన కథలను రాశారు. ప్రముఖ రచయితలు చిన్న కథ రాయడం కష్టమని చెప్పినా, ప్రసాద్ మాత్రం ఆయా కథలను ఆసక్తికరంగా, కథలను సూఖాంతం చేస్తూ హాయిగా చదివేసేలా రాయడంలో సిద్ధహస్తులు.

తన వృత్తి జీవితంలో భాగంగా గ్రామీణ ప్రాంతా



డాక్టర్.కె.ఎల్.వి.ఎస్. ప్రసాద్

లలో పని చేసిన అనుభవం ఆయన రచనలపై ప్రభావం చూపింది. సామాన్య ప్రజల జీవితాలను, వారి భావోద్వేగాలను తన కథల్లో పొందుపరిచారు. దంత ఆరోగ్యంపై 'డెంటల్ కేర్', 'చిల్డ్రన్ అండ్ డెంటల్ కేర్' అనే పుస్తకాలను కూడా రచించారు.

సాహిత్య రంగంలో ఆయనకు విశేష గుర్తింపు ఉంది. ప్రముఖ సాహిత్య సంస్థలైన సహృదయ, భారత్ వికాస్ పరిషత్, సారస్వత మేఖల వంటి వాటిలో వివిధ హోదాల్లో సేవలందించారు. 2011లో ప్రభుత్వ ఉద్యోగం నుంచి పదవీ విరమణ పొందిన తర్వాత, తన సమయాన్ని సోషల్ మీడియా (ఫేస్ బుక్) ద్వారా తన రచనలను పంచుకోవడానికి కేటాయిస్తున్నారు.

ఇప్పటివరకు ఆయన 'కె.ఎల్.వి. కథలు', 'అస్త్రం', 'హగ్ మీ క్విక్' అనే మూడు కథా సంపుటాలను వెలువరించారు. అలాగే 'విషాద మహనీయం' దంత వైద్యుడిగా 'చిన్న పిల్లలు దంత సమస్యలు', 'రచయితగా 'ఆట విడుపు', 'పనస తొనలు', 'చిలక పలుకులు', 'లేడీస్ సీట్ మరికొన్ని చిట్టి పొట్టి కథలు', 'నాన్నా పెళ్లి చేయవూ!(కథలు)',


సాహిత్య సంఘాల నిర్వాహకుడిగా:


వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కె.ఎల్.వి. ప్రసాద్, రాబోయే రచయితలకు ఒక ఆదర్శంగా నిలుస్తు



















న్నారు.

కథా సమీక్ష :

డాక్టర్ కె.ఎల్.వి. ప్రసాద్ రచించిన 'చేజారిన వసంతం' కథ, వయసు మళ్లిన జీవితాల్లోనూ ప్రేమకు, ఆత్మీయతకు, మానసిక అనుబంధాలకు ఉన్న అపారమైన విలువను హృద్యంగా ఆవిష్కరిస్తుంది. వృత్తిరీత్యా దంత వైద్యుడైన రచయిత, మానవ సంబంధాల్లోని సున్నితమైన భావోద్వేగాలను కథావస్తువుగా ఎంచుకోవడం అభినందనీయం. ప్రేమ అంటే యౌవనంలోనే పుట్టి, వివాహంతోనే పరిపూర్ణమయ్యే బంధం కాదని, ఒంటరితనంతో పోరాడే మనసులకు జీవిత చరమాంకంలోనూ కొత్త చిగుళ్లు తొడగగలదని ఈ కథ నిరూపిస్తుంది.

ముకుందరావు, యామిని పాత్రల పరిచయంతో కథ ప్రారంభమవుతుంది. భార్యకు దూరమైన ముకుందరావు, వైవాహిక జీవితంలో ఆశించిన సంతోషాన్ని పొందలేక పదేళ్లుగా ఒంటరిగా జీవిస్తున్న యామిని—ఇద్దరూ సాహిత్య సమావేశంలో పరిచయమై, క్రమంగా గాఢమైన ఆత్మీయతను పెంచుకుంటారు. పిల్లలు విదేశాల్లో స్థిరపడటం, వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత, జీవితంలో ఏర్పడిన శూన్యత వారిద్దరినీ మరింత దగ్గర చేస్తాయి. ఒకరికొకరు తోడుగా నిలుస్తూ, కోల్పోయిన ఆనందాలను తిరిగి పొందుతారు. నాస్తికురాలైన యామిని ఆస్తికురాలిగా మారడం, శాఖాహారుడైన ముకుందరావు ఆమె కోసం తన ఆహారపు అలవాట్లను మార్చుకోవడం వంటి సందర్భాలు వారి అనుబంధంలోని పరస్పర ప్రభావాన్ని చక్కగా తెలియజేస్తాయి.

ఈ కథలోని ప్రధాన బలం పాత్రల మానసిక చిత్రణ. ముకుందరావు ప్రేమలో స్వార్థం కంటే అంకితభావం ఎక్కువ. యామిని సంతోషమే తన సంతోషంగా భావిస్తూ, ఆమె అభిరుచులకు అనుగుణంగా నడుచుకుంటాడు. యామిని కూడా అతని ద్వారా జీవితంలో తిరిగి వసంతాన్ని అనుభవిస్తుంది. అయితే ఆమె ప్రేమకు ఒక పరిమితి ఉంది. తన



పిల్లల అంగీకారం, కుటుంబ గౌరవం, భవిష్యత్తుపై ఉన్న భయాలు ఆమెను బహిరంగంగా ఆ బంధాన్ని ప్రకటించకుండా నిరోధిస్తాయి. ఇక్కడే రచయిత మానవ మనస్తత్వంలోని సంక్లిష్టతను స్పృశించారు. ప్రేమ ఉన్నంత మాత్రాన జీవితంలోని ఇతర బాధ్యతలు, సామాజిక ఒత్తిళ్లు అదృశ్యం కావు. హృదయం కోరుకునేది ఒకటైతే, పరిస్థితులు అనుమతించేది మరొకటి కావచ్చు.

యామిని తల్లిదండ్రుల మరణం కథలో కీలక మలుపు. వారి మరణంతో హైదరాబాద్‌లో ఉండాల్సిన అవసరం తొలగిపోవడంతో ఆమె విదేశాల్లో ఉన్న పిల్లల వద్దకు వెళ్లాలని నిర్ణయించుకుంటుంది. అప్పటివరకు తమ బంధం శాశ్వతమనే ఆశతో జీవించిన ముకుందరావుకు ఈ నిర్ణయం ఊహించని దెబ్బ. విమానాశ్రయంలో ఆమెకు వీడ్కోలు చెప్పడానికి వచ్చిన అతని మౌనం, కన్నీళ్లు, మాటలు పెగలకపోవడం—ఇవన్నీ విడిపోవడాన్ని అంగీకరించలేని మనసు పడే వేదనకు ప్రతీకలు.

అయితే కథకు అసలైన భావోద్వేగ గాఢత యామిని రాసిన చివరి ఉత్తరంలో కనిపిస్తుంది. తమ అనుబంధం తన జీవితానికి అందించిన ఆనందాన్ని ఆమె మనస్ఫూర్తిగా అంగీకరిస్తూనే, ముకుందరావును వివాహం చేసుకోలేకపోవడానికి గల కారణాలను వివరిస్తుంది. అతనిపై ప్రేమ లేక కాదు, పిల్లలను దూరం చేసుకోలేని నిస్సహాయత వల్లే అతని ప్రతిపాదనను తిరస్కరించానని వెల్లడిస్తుంది. ఈ ఉత్తరం యామిని మనసులోని అపరాధభావాన్ని, కృతజ్ఞతను, ప్రేమను, విడిపోవాల్సిన అనివార్యతను ఒకేసారి ఆవిష్కరిస్తుంది. ఆమె నిర్ణయాన్ని సమర్థించాలా, తప్పుబట్టాలా అనే ప్రశ్నకంటే, ఆ నిర్ణయం వెనుక ఉన్న మానసిక సంఘర్షణను అర్థం చేసుకోవడమే పాఠకుడికి ముఖ్యం.

చివరలో గోడపై ఉన్న భార్య అన్నపూర్ణ ఫొటోలో ఆమె నవ్వుతున్నట్లు ముకుందరావుకు అనిపించడం కథకు మరో అర్థాన్ని జోడిస్తుంది. యామిని దూరమవడంతో అతని జీవితంలో ఏర్పడిన శూన్యత, గతానికీ వర్తమానానికీ మధ్య అతను చిక్కుకుపోయిన మానసిక స్థితి పాఠకుడిని కలచివేస్తాయి. ఈ ముగింపు విషాదాన్ని ప్రకటించదు; నిశ్శబ్దంలో అనుభూతి చెందేలా చేస్తుంది.

శీర్షిక 'చేజారిన వసంతం' కథకు సముచితమైన ప్రతీక. కొద్దికాలపు పరిచయమే జీవితాంతం గుర్తుండిపోయే మధురానుభూతులను అందించగలదని, అయితే ఆ అనుభూతులను శాశ్వతంగా నిలుపుకోలేకపోవడం మనిషిని మళ్లీ ఒంటరితనంలోకి నెట్టవచ్చని రచయిత తెలియజేస్తారు. కథనంలో మరికొన్ని సందర్భాలను సంక్షిప్తం చేసి, పాత్రల అంతర్మథనానికి ఇంకొంత విస్తృతిని ఇచ్చి ఉంటే భావోద్వేగ ప్రభావం మరింత పెరిగేది. అయినప్పటికీ, సరళమైన కథనం, సహజమైన పాత్రలు, ఉత్తరం ద్వారా వెల్లడయ్యే అంతరంగం, హృదయాన్ని తాకే ముగింపు ఈ కథకు ప్రత్యేకతను అందించాయి.

మొత్తంగా, 'చేజారిన వసంతం' కేవలం ప్రేమకథ కాదు; ఒంటరితనం, ఆత్మీయత, బాధ్యత, త్యాగం, విడిపోవడం కలగలిసిన జీవితానుభవం. మానవ సంబంధాలను తీర్పులకతీతంగా అర్థం చేసుకోవాలనే సున్నితమైన సందేశాన్ని అందించిన డాక్టర్ కె.ఎల్.వి. ప్రసాద్‌కు అభినందనలు. ఇలాంటి కథలు మరిన్ని రాస్తూ తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేయాలని ఆకాంక్షిద్దాం.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.